క్లుప్తంగా

ఆయకట్టుకు సాగునీరు విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టుకు విడుదల చేసిన సాగునీరు

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద సాగు చేసిన ఆయకట్టుకు నీటి తడులు కట్టుకునేందుకు మంగళవారం సాయంత్రం నీటిని విడుదల చేసినట్లు ఏఈ నారాయణ తెలిపారు. ఎడమ కాల్వ కింద 3,500కు పైగా ఎకరాల్లో రైతులు మొక్కజొన్న, కొర్ర వంటి ఆరుతడి పంటలను సాగు చేశారన్నారు. ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నీటి తడులు కట్టుకునేందుకు ఎడమ కాల్వకు 40క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొలాలకు నీళ్లు కట్టుకోవాలని సూచించారు.

తాగునీరు కలుషితం



రంగుమారిన నీరు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులో సోమవారం మున్సిపాలిటీ వారు సరఫరా చేసిన తాగు నీరు కలుషితమై రంగు మారింది. రంగుమారిన నీటిని ఎలా తాగాలని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై 35వ వార్డు ఉమామహేశ్వర నగర్‌వాసులు జీవన్ కుమార్, మధు, రంగస్వామి, రాము, సునీత, శ్యామలమ్మ తదితరులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. కలుషిత నీటితో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. లీకేజీని అరికట్టి సమస్యను పరిష్కరించాలని, స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.

సదస్సులు.. ఆవిష్కరణలకు వేదిక



బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

పాణ్యం: సదస్సులు యువ ఇంజినీర్ల వినూత్న ఆవిష్కరణలకు వేదిక అవుతాయని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్బారావు అన్నారు. ఆయన మంగళవారం ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఇంజినీర్లు తమ ప్రతిభను చాటుకోవాలంటే సదస్సులకు హాజరు కావాలన్నారు. హైడ్రోలాజికల్ మోడలింగ్ సిస్టం అనేది వర్షపాతం, నీటి ప్రవాహ ప్రక్రియలను విశ్లేషించడానికి, నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించడానికి యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్ అభివృద్ధి చేసిన శక్తివంతమైన సాఫ్ట్‌వేర్ అని చెప్పారు. వరద అంచనా, పట్టణ నీటి పారుదల రూపకల్పన, రిజర్వాయర్ నీటి నిర్వహణ, వాతావరణ మార్పు అధ్యయనాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, హెచ్‌ఓడీ శ్రీనివాసులు, కన్వీనర్ మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

సి.బెళగల్: ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామని.. ఆ నంబర్ ఆధారంగానే రానున్న రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఏఈఓ హిమబిందు అన్నారు. మంగళవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని ముడుమాల, కొండాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఫార్మా రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. ఏఈఓ మాట్లాడుతూ.. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు సంఖ్య ఇచ్చినట్లు, ప్రతి రైతుకు 11 నంబర్లతో యూనిక్ కోడ్ కేటాయిస్తారని తెలిపారు. ఇందు కోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పంటల్లో సంరక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, విత్తనోత్పత్తిపై రైతులకు వివరించారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

గడివేముల: గ్రామాల్లో నాటుసారా, డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ బ్రహ్మయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో నవోదయం 2.0 సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఆయన మట్లాడుతూ.. నాటు సారా తాగి ఆరోగ్యం చెడగొట్టుకోవద్దన్నారు. గ్రామాల్లో నాటుసారా, డ్రగ్స్ అమ్ముతున్న వారి గురించి టోల్ ఫ్రీ నంబర్ 14405 కాల్ చేసి సమాచారం ఇవ్వవచ్చన్నారు. అలాగే నంద్యాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ – 94409 02586, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ – 79894 09125 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఇళ్లపై యమపాశాలు!

- 11కేవీ వైర్లు ఇళ్లపై నుంచి వెళ్లడంతో ఇబ్బందులు
- ఏళ్ల తరబడి పాత తీగలతోనే కరెంటు సరఫరా
- అధ్వానంగా స్తంభాలు
- ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజల ఆందోళన



ఇందిరమ్మ కాలనీలో తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్



ఇ.తాండ్రపాడు గ్రామంలో ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ లైన్,



పసుపల గ్రామంలో రచ్చబండ వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

కర్నూలు(రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్లు ఇళ్లపై నుంచి వెళ్లడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపై విద్యుత్ తీగలు వెళ్లడంతో అవసరాల కోసం మిద్దెలపైకి ఎక్కాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

అన్ని చోట్లా సమస్యలు

కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామం ఇందిరమ్మ కాలనీలో తక్కువ ఎత్తులో 11కేవీ విద్యుత్ లైన్ వెళ్లడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉల్చాల గ్రామంలో తక్కువ ఎత్తులో 11 కేవీ విద్యుత్ లైన్ సమస్య ఉంది. పసుపల, సూదిరెడ్డిపల్లె, గార్గేయపురం, నూతనపల్లె, శివరామాపురం, నందనపల్లె, మిలిటరీ కాలనీ, జి.సింగవరం గ్రామాల్లో విద్యుత్ వైర్ల కింద వేలాడుతుండడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు దృష్టికి తీసుకెళ్లాం



ఇందిరమ్మ కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్లు చాలా కిందకు ఉన్నాయి. 50 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. విద్యుత్ లైన్ మార్చాలని గతంలో డీఈ కార్యాలయం ముందు కాలనీ వాసులతో కలిసి ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశాం. అయినా ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదు.

–బాలపీర, సర్పంచ్, ఇ.తాండ్రపాడు గ్రామం

సమస్యను పరిష్కరిస్తాం.



మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం. గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ సమస్యను నా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. సమస్యను పరిశీలించి పరిష్కారం చూపుతాం. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రస్తుతం గ్రామాల్లో ఇనుప కరెంటు స్తంభాలను మార్చి వాటి స్థానంలో సిమెంటు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నాం.

–మహమ్మద్ ఇస్మాయిల్, విద్యుత్ ఏఈ, కర్నూలు మండలం

ఇంటిపైకి వెళ్లాలంటే భయం



ఇందిరమ్మ కాలనీలో ఇంటిని నిర్మించుకున్నాం. అయితే మా ఇంటి పక్కన నుంచి తక్కువ ఎత్తులో 11కేవీ విద్యుత్ తీగలు వెళ్లాయి. దీంతో మిద్దె పైకి ఎక్కాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ లైన్ మార్చాలి.

–షేక్ ఫర్జానా, ఇందిరమ్మ కాలనీ, ఇ.తాండ్రపాడు

మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి



ఇందిరమ్మ కాలనీలో 11 కేవీలైన్ విద్యుత్ తీగలు మా ఇంటిపై నుంచి వెళ్లాయి. గతంలో మేకలు మిద్దెపైకి ఎక్కడంతో 11 కేవీ లైన్ విద్యుత్ తీగలు తగిలి 3 మేకలు ప్రాణాలు కోల్పాయాయి. మనుషులకు ప్రమాదాలు జరగకముందే మా సమస్యను పరిష్కరించాలి.

–మద్దమ్మ, ఇందిరమ్మకాలనీ, ఇ.తాండ్రపాడు

రీసర్వే పకడ్బందీగా చేపట్టండి



గగ్గటూరులో రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

పాణ్యం: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. ఆయన మంగళవారం గగ్గటూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమక్షంలోనే వారి భూములకు కొలతలు వేయాలన్నారు. విస్తీర్ణంలో తేడాలుంటే తక్షణమే వాటిపై దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. గ్రామంలో మొత్తం 542 భూ ఖాతాలు ఉన్నాయని, మొత్తం 1277.87 ఎకరాల భూమి ఉందన్నారు. సగానికిపైగా రీసర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, డీటీ శివశంకర్‌రెడ్డి, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా సర్వే చేయండి

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేను రైతులకు ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. ఆయన మంగళవారం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను తనిఖీ చేశారు. రైతుల ఆధ్వర్యంలోనే వారి భూములను సర్వే చేయాలని మండల సర్వేయర్‌ను ఆదేశించారు. రైతులు తమ ఉన్న రికార్డులను అధికారులకు చూపించి రీసర్వేకు సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ హరికృష్ణ, మండల సర్వేయర్ మధు, వీఆర్వో అనిల్‌కుమార్‌రెడ్డి, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కొర్రకు రసాయన ఎరువులు వాడొద్దు



కొర్రసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఆరుతడి పంటగా సాగు చేసిన కొర్రపంటకు రైతులు ఎట్టి పరిస్థితుల్లో రసాయనిక ఎరువులను చల్లరాదని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మంగళవారం కోడుమూరులో ఆరుతడి పంటగా సాగు చేసిన కొర్ర పంట సాగుపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఆరుతడి పంటగా రైతులు 400ఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశారని, ప్రస్తుతం కొర్ర పంటకు ఎలాంటి రసాయనిక ఎరువులను వాడరాదని, ఈ ఎరువుల వల్ల కొర్ర బెట్టకొచ్చే ప్రమాదముందని తెలిపారు. ఏప్రిల్ 15నాటికి కొర్ర దిగుబడులు చేతికొచ్చే అవకాశముందని, అంతవరకు మరో రెండు నుంచి మూడు తడులు కొర్ర పంటకు నీళ్లు అవసరమవుతాయని రైతులు ఏఓకు వివరించారు.

బిజినెస్ కరస్పాండెంట్‌పై ఫిర్యాదు



ఎస్ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఓ బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ పాయింట్) గా పనిచేస్తున్న వ్యక్తిపై పలువురు ఎస్ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. మంగళవారం సి.బెళగల్, కంబదహాల్ గ్రామాలకు చెందిన పలువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐను కలిసి తమ సమస్యను విన్నవించారు. మండలంలోని కంబదహాల్ గ్రామానికి చెందిన హరికుమార్‌రెడ్డి సి.బెళగల్‌లోని ఒక బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. తమ వద్ద అవసరాలకు డబ్బు అప్పుగా తీసుకున్నాడని.. తిరిగి చెల్లించాలని అడిగేందుకు ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉందన్నారు. కొంతకాలంగా పత్తా లేకుండా పోయాడని.. అతని ఆచూకీ గుర్తించి తమ డబ్బులను తిరిగి ఇప్పించాలని కోరారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. కాగా హరికుమార్‌రెడ్డి పలువురు రైతులు, వ్యాపారుల నుంచి అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.4.5 కోట్లకుపైగా అప్పు చేసినట్లు కంబదహాల్ గ్రామంలో చర్చించుకుంటున్నారు.



ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఎల్లమ్మకు విశేష పూజలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఇళ్ల స్థలాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



దరఖాస్తుదారులతో కిక్కిరిసిన తహసీల్దార్ కార్యాలయం

కల్లూరు: ఇంటి స్థలాల కోసం పేదలు కల్లూరు తహసీల్దార్ కార్యాలయానికి వెల్లువలా వచ్చి దరఖాస్తులు సమర్పించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం 2 వేల మందితో కలిసి కల్లూరు 70/2బీ సర్వే నంబర్‌లో జెండాలు పాతారు. దీంతో తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించి అర్హులైన వారు అర్జీలు ఇవ్వాలని చెప్పడంతో మంగళవారం నగరంలోని పేద ప్రజలు వేలాదిగా తరలివచ్చి రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు అందజేశారు. అంతకుముందు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌తో పాటు జిల్లా నాయకులు రాధాకృష్ణ, నిర్మల, రాముడు, పేదలతో కలిసి కార్యాలయం ముందు ధర్నా చేపటారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. తామంతా ప్రభుత్వ స్థలాలను పేదలకు పంచుతుంటే, అధికార పార్టీలు మాత్రం తమ ఖాతాలో జమ చేసుకుంటున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉన్నది ప్రజల కోసం అని, కొంతమంది నాయకుల కోసం కాదన్నారు. తహసీల్దార్ కార్యాలయం అక్రమాలకు, అవినీతికి అడ్డాగా మారిందని ధ్వజమెత్తారు. అర్హులకే ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం కోరుకుంటుందన్నారు. తహసీల్దార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. సీపీఎం నాయకులు రాజశేఖర్, అలివేలమ్మ, అరుణ, గురు శేఖర్, రామకృష్ణ, నరసింహులు, సాయిబాబా, సుధాకరప్ప, రఫీ, ప్రభాకర్, యేసు, ఉస్మాన్, పద్మ, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ బాలుర గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ప్రసాద్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి (ఇంగ్లిష్ మీడియం), 6, 7, 8 తరగతులలో మిగిలిపోయిన ఖాళీలకు సంబంధించి విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సమీపంలోని మీ సేవా, నెట్ కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

నీటిని వృథా చేయొద్దు

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని అమడగుంట్ల, చిల్లబండ, ఎర్రదొడ్డి గోరంట్ల గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈ ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లతో కలిసి మంచినీటి పథకాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా మంచినీటి కొరత రాకుండా ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, అధికారులు చర్యలు తీసుకోవాలని డీఈఈ సూచించారు. అలాగే గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఏవైనా లీకేజీలుంటే పైపులైన్లు మార్చాలని డీఈఈ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అమడగుంట్ల, గోరంట్ల, ఎర్రదొడ్డి సర్పంచ్‌లు వరలక్ష్మి, బాలక్రిష్ణ, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమడగుంట్లలో మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీఈఈ, ఏఈ

లావాదేవీలపై వీఓఏలకు శిక్షణ



వీఓఏలకు శిక్షణ ఇస్తున్న ఏపీఎం

సి.బెళగల్: పొదుపు గ్రూపుల్లో సభ్యులు నిర్వహించే ఆర్థిక లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వీఓఏలకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) కార్యక్రమ నిర్వహణలో భాగంగా లోకాస్ యాప్‌లో నమోదు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. మండలంలోని 41 గ్రామైక్య సంఘాలు, 1,372 పొదుపు గ్రూపులను ఇప్పటికే ఎన్‌ఆర్‌ఎల్‌ఎం పరిధిలోకి నమోదు చేయించడం జరిగిందన్నారు. అదే విధంగా వీలైనంత త్వరగా పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్‌ల ద్వారా నిర్వహించే లావాదేవీలను లోకాస్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు రాముడు, గుండమయ్య, శ్రీనివాసులు, మాదులు, మాబాషా, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు, వీఓఏలు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

గడివేముల: మండలంలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎస్ఏ రఫీ, ఖలీక్ ఆధ్వర్యంలో స్థానిక మసీదులో ఇఫ్తార్ విందును మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలు కఠోర దీక్షతో ఉపవాసం చేస్తారు. ఇంత నియమ నిష్ఠలతో దీక్ష చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఉపవాసం చేస్తున్న వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడంతో రంజాన్ నెలంతా ఉపవాసం చేసిన పుణ్యం దక్కుతుందన్నారు.



బిలకలగూడూరు మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మామిడి సాగులో మెలకువలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలో మామిడి సాగు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఉద్యాన శాస్త్రవేత్త దీప్తి, ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. వారు మంగళవారం మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మామిడిలో పూత, కాయ దశలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలువుతున్న పథకాలను, పండ్ల తొడుగులు (ఫ్రూట్ కవర్స్) గురించి వివరించారు. సొంత పొలం కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని, ఇది రైతుకు గుర్తింపు కార్డుగా పనిచేస్తుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్టపరిహారం, యాంత్రీకరణ, సున్నా వడ్డీ పంట రుణాలకు అర్హులు అవుతారన్నారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి దివ్య, రైతులు గని ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



రైతు సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్దటేకూరులో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతు సంఘం నాయకులు పుల్లన్న, మహమ్మద్, హేమంత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



గూడూరులో వైద్యాధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

కోడుమూరు రూరల్: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైనందున ఈనెల 6న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు తమ సమస్యలపై గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. బడ్జెట్‌లో సైతం ఆశావర్కర్ల సంక్షేమం కోసం ఎలాంటి కేటాయింపులను చేయకపోవడంతో ఆశావర్కర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లకు నెలకు రూ.26వేల జీతాన్ని చెల్లించడంతో పాటు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు మధవి, శేషమ్మ, ఆదిలక్ష్మి, గిరిజ, వరలక్ష్మి, మునిరాభాను, సావిత్రి పాల్గొన్నారు.